విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 10, డిసెంబర్ 2023

పాఠశాల ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర-అవుకు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి అని ఆంధ్రప్రదేశ్ స్కూలు ఆయా అండ్ స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డి శివ బాలకృష్ణ అన్నారు. అవుకులో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు నాగంజేయుల అధ్యక్షతన స్కూల్ ఆయా యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ స్కూల్ ఆయా అండ్ స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిశివ బాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలకు పని భారం తగ్గించాలని, అదేవిధంగా వీరికి గుర్తింపు కార్డు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. హైస్కూల్లో అధనంగా ఇంకొక ఆయాకు అవకాశం కల్పించాలని, హైస్కూల్లో పని భారం ఎక్కువగా ఉండటంతో ఒక ఆయా పనిచేయ లేక పోతుందని మరో ఆయను తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వం పరిధిలోనే పనిచేస్తున్నారు. వారిని సైతం ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించి, నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని, గ్లౌజులు, మాస్కులు గవర్నమెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 2018-19 సంవత్సరానికి సంబంధించి పాత బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని డిమాండ్ చేశారు. 108 జీవో ప్రకారం 11500 వేతనం ఇవ్వాలని ,వీరికి ప్రభుత్వం చెప్పిన విధంగానే నెలలో కనీసం ఒక్కరోజు అయినా సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు రవి, కుళాయిస్వామి, ఆయా యూనియన్ నాయకు రాలు రాధమ్మ ,మేరీ ,రామేశ్వరి ,కల్పన, నక్షత్రమా ,తులసి ,పుల్లమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

గ్రామీణ కష్టజీవుల ధర్నాకు తరలిరండి

విశాలాంధ్ర - నంద్యాల : వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణమే గ్రామాలలో ప్రారంభించాలని కష్టజీవులను ఆదుకోవాలని, ఈనెల 14న గురువారం విజయవాడ ధర్నా చౌక్ దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ కార్యాలయంలో గోడపత్రిక విడుదల చేసినట్లు వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వలస కూలీలు, గ్రామీణ రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. గోడపత్రిక విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం కొ-కన్వీనర్ సోమన్న, నాయకులు సాంబ, మస్తాన్, మహబూబ్బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టీడీపీకి పట్టం కట్టాల్సిందే-మాజీ ఎమ్మెల్యే బీసీ

విశాలాంధ్ర-బనగానపల్లె : రాష్ట్రాభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీకి 2024 ఎన్నికల్లో పట్టం కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బీరవోలు,చిన్న రాజుపాలెం తండాలో బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీసెల్ అధ్యక్షుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో బీసీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి ఒటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో సూపర్ సిక్సర్ గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. 2024లో ఎన్నికల్లో నియోజకవర్గంతో పాటుగా రాష్ట్రంలో మన పార్టీని గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమవుతోందన్నారు. అందుకు అనుగుణంగా పార్టీశ్రేణులు సన్నద్ధం కావా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, బాలనాయుడు, మనోరంజన్‌రెడ్డి, మద్దిలేటి రెడ్డి, పెద్ద గురెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మనోహర్, రాజు పిఏ మురళీమోహన్ రెడ్డి, గ్రామ ప్రజలు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగెల ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరిక

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం రుద్రవరం మండల కేంద్రానికి చెందిన 70 కుటుంబాల వారు స్వచ్ఛందంగా జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరిని తాలూకా జనసేన పార్టీ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.నాగ లింగమయ్య, గౌడ్, చంటి, బన్నీ, హుస్సేన్ భాష, సురేష్, నరసింహ, జాకీర్, నరేష్, హుసేని, బాలస్వామి, ఓబయ్య, నవీన్, మహమ్మద్, రాజు, సూరి, విజయ్, చైతన్య, వెంకటసుబ్బయ్య, జనార్ధన్ తదితరులు జనసేన పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరారు. తమను నమ్మి పార్టీలో చేరిన వారికి అండగా ఉండాలని ఇరిగెల తెలిపారు.కార్యక్రమంలో పార్టీ తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి, ఇరిగెల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని వెంకటాపురంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ కందుల మల్లీశ్వరి ప్రసాద్ రెడ్డి శనివారం త్రాగునీటి బోర్వెల్ ను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ ప్రజలనీటి వసతిని త్రాగునీటి ఇబ్బందిని అన్ని వర్గాల ప్రజల నీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే గంగుల భిజెంద్ర రెడ్డి ఆదేశాల మేరకు. బోర్వెల్ లో ఏర్పాటు చేయడం జరిగిందని వైసీపీ యువనేత కందుల ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బోర్వెల్ వాహనానికి పూజలు నిర్వహించి ప్రారంభించడంతో త్రాగునీరు పుష్కలంగా వద్దాయని ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది,వార్డు వాలంటరీ లు పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణ కోసం పాటుపడాలి

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్: ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ అలాన్ చౌన్ టెరాంగ్‌ను హానరరీ వైల్డ్ లైఫ్ వార్డెన్ పువ్వాడి భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల హానరరీ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పువ్వాడిభాస్కర్ ఆత్మకూరు డీడీఎఫ్ డి.అలాన్‌చౌంగ్ టెరాన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వన్యప్రాణి సంరక్షణ కోసం పాటుపడాలని డీడీ పువ్వాడీని కోరారు. జడ్పీటిసి శివశంకర్‌రెడ్డి, నాయకులు మొగిల్లపల్లె రామ చంద్రయ్య శెట్టి, మాజీ ఎంపిటిసి వరప్రసాద్ రాజులు పాల్గొన్నారు.

ఎర్రగుడి మాజీ సర్పంచ్ మృతి

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : మండలంలోని ఎర్ర గుడి గ్రామ మాజీ సర్పంచ్ యాపర్ల సుబ్బారెడ్డి(85) అనారోగ్యంతో జమ్మలమడుగు పట్టణంలో శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు సుబ్బారెడ్డి వయస్సు రీత్యా అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఇటీవల వారి కుటుంబం జమ్మలమడుగులో నివాసముంటున్నారు. రాజకీయ నేపథ్యం గల కుటుంబం కావడంతో సుబ్బారెడ్డి ఎర్రగుడికి సర్పంచ్ పదవితో పాటు, హనుమంతు గుండం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా కూడా గతంలో పనిచేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. సుబ్బారెడ్డి మృతి చెందారన్న విషయం తెలుసు కుని గ్రామస్తులు దిగ్భ్రాంది చెందారు.వీరి కుమారుడు వెంకటేశ్వర రెడ్డి కూడా ఎర్రగుడి గ్రామ సర్పంచ్ గా పనిచేశారు.

గుండం ఆంజనేయ స్వామికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : మండలంలోని కోరుమాను పల్లి గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ గుండం ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. కార్తీక మాసం కడ శనివారం సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు తరలివచ్చి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో గుండంలోని జలాలలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామి పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల జిల్లా వైసీపీ ప్రచార అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మహోత్సవం సందర్భంగా చెక్కభజన, పౌరాణిక నాటకములు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విచ్చేసిన భక్తులకు దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం గావించారు.పూజలో ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి లు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - నంద్యాల : ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలను నంద్యాల టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయం నందు కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతలయ్య మాట్లాడుతూ సోనియా గాంధీ చేసిన త్యాగాలను కొనియాడారు. తెలంగాణ ఎన్నికల్లో ఘన విజయం సాధించి అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారప్రతినిధి ఉకోటు వాసు, ట్రెజరర్ ప్రసాద్, రియాజ్, జానీ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శిల్పా కుటుంబ పాలనను పార దోలుదాం- టీడీపీ ఇన్‌చార్జ్ ఫరూక్

విశాలాంధ్ర - నంద్యాల : తెలుగుదేశం పార్టీ గెలుపుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, నంద్యాల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. నంద్యాల మండల టీడీపీ నాయకులు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఫరూక్ మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడే కొద్ది శిల్పా రవి, అతని తండ్రి శిల్పా మోహన్‌రెడ్డి కుటిల రాజకీయాలు చేస్తారని, వాటిని గ్రామ నాయకులు పసిగట్టి అప్రమత్తతో ఉండాలని పేర్కొన్నారు. శిల్పా కుటుంబ పాలనను నంద్యాల నుండి పారద్రోలాలని పిలుపునిచ్చారు. అగాగే టీడీపీ సానుభూతిపరులు ఓటుహక్కు ఉందో లేదో చూడాల్సిన బాధ్యత క్లస్టర్ యూనిట్, బూత్ కన్వీనర్లదేనని దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే చాలా మంది ఓట్లు అధికార పార్టీ నేతలు తొలగించారని,దాదాపు 10వేల దొంగ ఓట్లు ఎక్కించారని, దీనిపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలన్నారు ఓటమి భయంతోనే వైసీపీ పార్టీ ఇటువంటి కుటిల రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. నాలుగున్నార సంవత్సరాల వైకాపా పాలనలో జగన్‌పై ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టి చంద్రబాబును సీఎంగా చేయాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో 6 పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ బాబాన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాదులు రామచంద్రరావు, తులసిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నాయకులు త్రిలింగేశ్వర్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, చింతల సుబ్బరాయుడు, జనసేన నాయకులు విశ్వనాథ్ తో పాటు అధిక సంఖ్యలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు రాజేంద్రన్ మృతికి సంతాపం

విశాలాంధ్ర-బేతంచెర్ల: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కేరళ రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రాజేంద్రన్ (73) శనివారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే.కార్మిక కర్షక వర్గానికి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ జాతీయ స్థాయిలో పనిచేసి కేరళ రాష్ట్రంలో మూడుసార్లు శాసనసభ్యుడిగా నేడు కేరళలో పరిపాలన చేసినటువంటి ఎల్డిఎఫ్ కన్వీనర్‌గా వామపక్ష ఉద్యమానికి అండగా ఉండి పేద ప్రజల పక్షపాతిగా నిరంతరం పోరాటం చేసే పోరాట యోధుడు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు అలాంటి నాయకుడు మరణం ప్రజాస్వామ్యానికి తీరనిలోటని వారి ఆశయాలను ఆలోచనలను నేడు దేశంలోని యువత ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని బేతంచర్ల పాత బస్టాండ్ నందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కొవ్వొత్తులతో నివాళు లర్పించారు.అనంతరం జరిగిన సభకు సీపీఐ మండల కార్యదర్శి వై భార్గవ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోట రాముడు, సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తిరుమలేశు, దస్తగిరి, సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు భాస్కర్, అంబాపురం మాజీ ఎంపీటీసీ మెంబర్ బాలస్వామి, సోమన్న, సీపీఐ నాయకులు కోన రామకృష్ణ, శ్రీరాములు, తిమ్మయ్య, నాగేష్, శంకర్, రామదాస్, శివ, శ్రీను, శరత్, ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనతోనే సుస్థిరాభివృద్ధి -మాండ్ర

విశాలాంధ్ర- జూపాడుబంగ్లా: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనతోనే రాష్ట్ర సుస్థిరాభివృద్ధి సాధ్యమని మాండ్ర శివానందరెడి నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని 80 బన్నూరులో టీడీపీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ ,శేఖర్ యాదవ్, ఉస్మాన్ భాష, అబ్దుల్‌హక్, పార్టీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్‌ల ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధిని విస్మరించి ప్రజలను ముంచిందని ఆరోపిం,ఆరు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాలలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ దారుణ మన్నారు.విద్యుత్ బిల్లులు 9 సార్లు పెంచి రైతులను ప్రజలను దోచుకుంటూ వారి నడ్డి విరుస్తున్నారన్నారు నిరుద్యోగుల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. నవరత్నాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నిరుద్యోగులను విస్మరించారన్నారు.2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేసి ప్రదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు విరుస్తూ కరపత్రాలు మాండ్ర అందజేశారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు...! భక్తిశ్రద్ధలతో కార్తీకదీపాలు- పుణ్యనది స్నానాలు

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రంగా శక్తిపీఠంగా విరజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మాస చివరి రోజులు రెండవ శనివారం ,ఆదివారం కావడంతో శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు .భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ఆలయ వేళలో మార్పులు చేయడంతో పాటు సిబ్బందికి ప్రత్యేక విధులు కూడా కేటాయించారు. క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం బిస్కెట్లు ,పాలు, నీరు, అల్పాహారం అందిస్తున్నారు .అదేవిధంగా భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు శివ మాడవీధి యందు మరియు గంగాధర్ మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి ,అమ్మవాళ్ల దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతుంది .అధిక సంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలిరావడంతో వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కూడా దేవస్థానం వారు ఏర్పాటు చేశారు. శ్రీశైలం అంత వాహనాలతో భక్తుల రద్దీతో కిటకిటలాడుతుంది .సుమారు 70000 మంది పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా.

పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర -డోన్: పెంపుడు జంతువుల పట్ల యజమానులు జాగ్రత్తలు పాటించాలని డోన్ పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు డా. నాగరాజు అన్నారు. డోన్‌లో రైల్వే స్టేషన్ రోడ్డులో డా.కె.ఎల్.ఎన్. రాజు కంటి ఆసుపత్రి పక్కన కొత్తగా పశుపతి వెటర్నరీ సర్వీసెస్ వారు పెంపుడు జంతువుల చికిత్స మరియు ఇతర అవసరాలకు కోసం పెట్ క్లినిక్ ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ క్లినిక్ తరుపు నుండి రెండు రోజుల పాటు పెంపుడు జంతువులకు ఉచితముగా డీవార్మింగ్ చేయడం జరుగుతుందన్నారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండ డీవర్మింగ్ మరియు వాటికీ తరచుగా సోకె వ్యాధుల బారిన పడకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే పెంపుడు జంతువులు ఆరోగ్యాంగా ఉంటాయన్నారు . అలాగే వాటికి కావలసిన పోషక విలువలు ఉన్న ఆహారం విశిష్టత గురించి వివరించారు. ఇదే సందర్భంగా యాజమాన్యం వారు మాట్లాడుతూ పెంపుడు జంతువులకి కావలిసిన వైద్య సేవలు, ఆహారం, వస్తువులు, బొమ్మలు, గొలుసులు మొ లభిస్తాయని, పార్వో వ్యాధి సోకిన కుక్కలకు ప్రత్యేక చికిత్స కలదని చెప్పారు. గ్రూమింగ్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉచిత డీవర్మింగ్ నేడు కూడా కొనసాగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : దేశంలో మరియు రాష్ట్రంలో మార్పు మొదలైందని 2024 సార్వత్రిక ఎన్నికల్లో దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షులులక్ష్మీనరసింహ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్ భాష ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 77వ జన్మదిన వేడు కలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మినరసింహ హాజరై కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మినరసింహ మాట్లాడుతూ సోనియా గాంధీ చేసిన త్యాగాలను కొనియాడారు. అధికారం కోసం వెంటపడే ఈ రోజుల్లో ప్రధానమంత్రి పదవిని సైతం తీసుకోకుండా మన్మోహన్‌సింగ్‌నే రెండు సార్లు పదేళ్లు పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ప్రధానమంత్రిగా చేసిన ఘనత సోనియా గాంధీ గారికే దక్కిందన్నారు. వారి కుటుంబంలో ఇందిరాగాంధీ మరియు సోనియా గాంధీ భర్త రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురైన కూడా బెదరకండ దేశ భద్రత కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి తన ఇద్దరు పిల్లలను కూడా ప్రజల్లోకి పంపి ప్రజాసేవకే అంకితం చేసిన ఘనత సోనియా గాంధీకి దక్కుతుందన్నారు.

కార్యకర్తకు పరామర్శ

విశాలాంధ్ర -బనగానపల్లె: కార్యకర్తను పరామర్శించిను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి బనగానపల్లె లోని బీసీ గుర్రెడ్డి కాలనీలో ఏరాసు హరినాథ్ రెడ్డి కొన్ని రోజుల క్రితం బైక్ ప్రమాదంలో గాయపడి ఉదయానంద హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి వారి ఇంటి దగ్గరికి వెళ్లి హరిని పరామర్శించి వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మల్లారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర -శ్రీశైలం: మండలంలోని సున్నిపెంట ఏపీ ఆర్ఎస్ పాఠశాల బీసీ (స్థానిక మహాత్మ జ్యోతిబాయ్ పూలే స్కూల్) నందు పూర్వ విద్యార్థుల సమ్మేళనం 1997-1998 బ్యాచ్ శనివారం ఘనంగానిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు తమ పూర్వ అనుభవాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు స్కూల్ నందు పాఠశాలకు అధునాతమైన కంప్యూటర్లు మరియు గ్రంథాలయమునకు పుస్తకములు బహుకరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు,. తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టరు బోల్తా -వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చింతలచెరువు గ్రామంలో పొలం పనుల నిమిత్తం ట్రాక్టరులో వెలుతున్న లక్ష్మీనారాయణ(47) ప్రమాదవశాత్తు ట్రాక్టరు బోల్తా పడటంతో అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్సై రమణయ్య తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి శనివారం తెల్లవారు జామున ట్రాక్టరు గొర్రు తీసుకుని పొలం దున్నేందుకు బయల్దేరారు. పొలాల రస్తాలో మట్టిదారిలో అక్కడే ధాన్యం ఆరవేయడంతో పక్కకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ట్రాక్టరు ప్రమాదవశాత్తు సమీపంలోని చిన్నకాలువలో బోల్తాపడింది. దీంతో ట్రాక్టరులోని వ్యక్తి తలభాగం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

జిల్లాస్థాయి చదరంగం పోటీలు

విశాలాంధ్ర - నంద్యాల: ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో శనివారం స్థానిక హనీఫ్ నగర్లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సుబ్బయ్య, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ విద్యాశ్రీ, రాష్ట్ర చెస్ సంఘం జాయింట్ సెక్రెటరీ రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ చదరంగం పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని తద్వారా చదువులలో కూడా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. నిరంతర సాధన ద్వారా క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. పోటీలలో దాదాపు 150 మంది చదరంగం క్రీడాకారులు జిల్లా వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర - వెలుగోడు : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ది పొందుతున్నారని అన్నారు. మండలం లోని గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాలలో శనివారం పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రజల కు పంపిణీ చేయడం జరిగింది. మరియు పంటల నీటి మందులను ఉపయోగించే డ్రోన్ పరికరాన్ని ప్రజలకు చూపించి అవగాహన కలిగించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన కల్పించడం జరిగింది. ఉజ్వల గ్యాస్ పథకం కింద లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు.. భారతదేశ అభివృద్ధి చెందే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అనంతశయన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో టీడీపీని గెలిపించండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామని తాలుకా టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్వీ ప్యాలెస్ వీధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పీటిసి చాంద్ బాషా, గుండా మణి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

రాజేంద్రన్ మృతి సీపీఐకి తీరనిలోటు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్ మృతి సీపీఐకి తీరనిలోటని ఆయన మృతికి సంతాపం తెలియచేస్తూ పూలమాలలువేసి నివాళులు అర్పించారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డిల ఆద్వర్యంలో రాజేంద్రన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజేంద్రన్ పదేళ్ల పాటు సీపీఐ శాసనసభ్యులుగా, 8 సంవత్సరాల నుండి పార్టీ రాష్ట్రకార్యదర్శిగా పనిచేశారన్నారు. అనారోగ్యంతో కోలుకోలేక మృతి చెందినట్లు వారు తెలిపారు. ఆయన మృతికి సంతాపం తెలి యచేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి ని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయకార్యదర్శి డి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షకార్యదర్శులు బాబయ్య, బీసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్, దస్తగిరి, రామచంద్ర, సురేంద్ర, విజయ, ప్రేమలత నాయకులు పాల్గొన్నారు.

వైద్యశాల అధనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రూ. 34 లక్షల వ్యయంతో అదనపు గదుల నిర్మాణానికి శనివారం వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, సచివాలయ జేఏసీ కన్వీనర్ రవిచంద్రారెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆసుపత్రులను నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం వైయస్ జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, వైసీపీ నాయకులు పూజారి ఈరన్న, జాము మూకన్న, ముక్కరన్న, అర్లప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండలో ప్రబలిన అతిసారా

నీటి ట్యాంకులకు పైకప్పులు లేకపోవడంతోనే..!

కోతులు చేరి కలుషితం చేస్తున్న తాగునీరు

తాగునీటి పైపులలోకి మురుగు నీరు ..ఆనీరే ప్రజలకు సరఫరా..!

రోగాలతో జనం సతమతం.. పట్టించుకోని అధికారులు..!!

తాగునీటి పైపులైన వద్ద పాకర పట్టిన దుస్థితి

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. అప్పుడే అందరికీ ఆరోగ్యం. చీపురు పట్టండి.. చెత్తను ఊడ్చేయండి. రోగాలను తరిమే యండి. ఇదీ అధికారుల ఘోష, కానీ ఇదేం ఖర్మమో? దేవనకొండతో పాటు పలు గ్రామాల్లోని తాగునీటి వ్యవస్థలో చెత్త తెల్లు కట్టినా.. స్థానిక అధికారుల్లో చలనం లేదు. అయ్యా జగనయ్య కాపాడాలని ఎంత మొత్తుకున్నా..మండల,జిల్లా అధికారుల ఎదుట గగ్గోలుపెట్టినా.. కనీస స్పందన కరువైంది. ఎక్కడ చూసినా తాగునీటి పైపుల్లోకి మురుగు కాలువలు నీరు చేరటం, చెత్త కుప్పలు..పిచ్చి మొక్కలు తాండవిస్తుంటే.. అధికారులకు కనిపించవు, అతిసార, డెంగ్యూ, మలేరియా వ్యాధులకు గురి అవుతున్న అదే మంటే... స్వచ్ఛతా హి సేవ పేరిట అధికారులు ఊళ్లల్లో సందడి చేయటం విశేషం.

- విశాలాంధ్ర - దేవనకొండ

ఎన్నడూ లేనివిధంగా భారీ స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు గ్రామాల్లో, పట్టణాల్లో మౌలిక వసతులపై కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎంతో ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నా, సమస్యలను పరిష్కరించాలని లక్ష్యాలను నిర్దేశిస్తున్నా... అమలు చేయడంలో స్థానిక అధికారుల నిర్లక్ష్యం నిండుగా ఉంది. కొంతమంది అధికారుల వ్యవహార శైలి, విధుల్లో నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తప్పటం లేదు. క్షేత్రస్థాయిలో అధికారులు వెల్లడించే వివరాలకు వాస్తవ పరిస్థితి పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. జీవనాధారమైన తాగునీటి సరఫరా లోనూ నిలువెత్తు నిర్లక్ష్యం దేవనకొండ మరియు పలు గ్రామాల్లో నెలకొంది. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఎన్నిసార్లు హెచ్చరించిన తమకు ఏమి పట్టనట్లు పూర్తి స్థాయిలో కొందరు పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహిస్తున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా శనివారం దేవనకొండ పట్టణంలో పలు కాలనీలలో అతిసరా కి గురి అవ్వడం ఆశ్చర్యం.తాగునీటి సరఫరా ట్యాంకులలోకి కోతులు చేరి తాగునీటిని కలుషితం చేస్తున్నాయి అంతేకాక తాగు నీటి పైపులలో కి మురికి నీరు చేరటంవల్ల అదే నీరు తాగటం వలన అనారోగ్యాలకు గురవుతున్నారు.సంపులలో పిచ్చి మొక్కలు మొలిచి నిలువెత్తు పెరగటమే కాదు.. బెరడు కట్టిన వ్యర్థాలతో ఫిల్టర్ బెడ్లు నిండి పోయాయి. వ్యర్థాలు బెరడులుగా కట్టి నెలలు తరబడి ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేయకపోవటమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇలా బెరడులు కట్టిన ఫిల్టర్ బెడ్లోనే నీటిని నింపి తిరిగి ఓ హెచ్ ఆర్ ల ద్వారా కుళాయిలకు సరఫరా చేయడంతో ఈ నీటిని తాగిన ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. కనీసం స్నానానికి ఉపయోగించే సమయంలో చర్మసంబంధిత రోగాలు, దురదలతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారని ప్రజల చర్చించుకుంటున్నారు తమకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని, కుళాయిలకు వచ్చే నీటిని తాగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు

పర్యవేక్షణ శూన్యం: గ్రామ స్థాయిలోని కార్యదర్శులకు మండల స్థాయి జిల్లా స్థాయి అధికారులు అభయం మెండుగా ఉండటంతో పర్యవేక్షణ శూన్యంగా కనిపిస్తోంది. వారి అండదండలతోటే నిబంధనలకు అనుగుణంగా 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సిన ఓహెచ్ఎర్ లను నెలలు తరబడి శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. ఫిల్టర్ బెడ్లు లో భయంకరంగా బ్యాక్టీరియాతో నిండినా కనీస చర్యలు లేకుండానే ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రజలు అనారోగ్యాలకు గురై నప్పుడు చనిపోయినప్పుడు మాత్రమే అధికారులు అలా గ్రామ వీధుల్లో తిరుగుతారు అనే ఆరోపణలు ఉన్నాయి ఎవరైనా స్పందనలో జగనన్నకు చెబుదాం కి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వారిపై బెదిరింపు చర్యలకు పాల్పడటం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్యను పరిష్కరించకుండానే పరిష్కరించామని చెబుతూ ఉన్నత అధికారులకు తప్పుడు సమాచారం పంపుతున్నారనివిమర్శలు ఉన్నాయి. వీటన్నిటిపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో. గ్రామాల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతుంది. ఎప్పటికైనా సంబంధిత అధికారులలో చలణం వస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

గ్రామీణ కష్టజీవుల ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కోడుమూరు : ఈనెల 14న జరిగే గ్రామీణ కష్టజీవుల ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.కృష్ణ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి కృష్ణ,నియోజకవర్గ కార్యదర్శి డి శేషుకుమార్‌లు మాట్లాడతూ రాష్ట్రవ్యాప్తంగా ఈఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్రమైన అనావృష్టితో వ్యవసాయ పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని,వ్యవసాయ కూలీలకు పనులు దొరకక వలసలకు వెళ్లారన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించారని వారన్నారు. అలాగే రైతులు వేసిన పంటలు దెబ్బతిని కోలుకోలేక దిక్కులేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని,గ్రామీణ ప్రాంతాల్లోని పల్లెలన్నీ కరువుతో కన్నీరు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రములో రైతులకు తీరని అన్యాయం జరిగి దుర్భర పరిస్థితి ఏర్పడినప్పటికీ,ప్రభుత్వానికి రైతులు,కూలీలను ఆదుకునే దృష్టి లేదని, సహాయక నివారణ చర్యలు తీసుకోవాలని ధ్యాసే లేదన్నారు. ఉపాధి కూలీల వలసల నివారణ,నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు,అధికారులు స్పందించడం లేదని, కష్టజీవులంతా ఐక్యంగా ఉద్యమించేందుకు ఈనెల 14న విజయవాడలోని ధర్నాచౌక్‌లో నిర్వహించే ధర్నా కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు, పట్టణ కార్యదర్శి రాముడు వ్య.కా.సంఘం నాయకులు కోటకొండ మద్దిలేటి, రాముడు, మునిస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్ టీయుసి జిల్లా కార్యదర్శి బొగ్గుల పరమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ గాలి వస్తుందని, దీనికి తెలంగాణ ఫలితాలే నిదర్శనమన్నారు. దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం...!

కార్తీక రైతు వనభోజన మహెూత్సవ విజయవంత కార్యక్రమంలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-పత్తికొండ: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్. మండగిరి శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్తీక రైతు వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈవనభోజనం మహోత్సవానికి ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివా సులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మిరెడ్డి, జగన్నాథం, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలిఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా కొనసాగించేందుకు రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పంట పొలాలకు సాగునీరు, మేలు రకం విత్తనాలు, పంపిణీ చేయాలని, పరపతి సౌకర్యం పండిన పంటలకు గిట్టుబాటు ధర, కరువులతో నష్టపోయినప్పుడు రైతాంగాన్ని ఆదుకోవడానికి చేపట్టాల్సిన తక్షణ కర్తవ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా రైతులకు అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు సరైన మెలకువలు పాటించాలన్నారు. రాయలసీమ అంటే రతనాల సీమ అంటున్నారని, రాయలసీమలో రాళ్ల తప్ప రతనాలు ఎక్కడ కనపడడం లేదన్నారు. రాయలసీమ జిల్లాల్లో నిత్యం కరువులతో రైతులు అల్లాడుతున్నారని, కరువు పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు తాను రైతు సంఘాలతో కలిసి రాయలసీమలో పర్య టి స్తానన్నారు. శాశ్వత కరువు నివారణ కు రైతు సంఘాలు ఉద్యమాలు చేపట్టాల న్నారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి. భీమ లింగప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజా సాహెబ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాపతి, పెద్ద ఈరన్న, గౌరవ అధ్యక్షులు కారన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారు మంచి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట రాముడు, నాగరాజు, ధనుంజయ, బొంతిరాళ్ల సర్పంచ్ రవి మో హన్, చిన్నహుల్తి, మండగిరి, సర్పంచులు కేశవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సోమశేఖర్, దేవన్న, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

11న కలెక్టరేట్‌లో స్పందన

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : ఈనెల 11న సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గృహ ప్రవేశానికి హాజరైన కోట్ల

విశాలాంధ్ర -వెల్దుర్తి : క్రిష్ణగిరి తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎరుకల చెరువు శివయ్య వెల్దుర్తిలో నిర్వహించిన నూతన గృహప్రవేశానికి శనివారం ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి హాజరైయ్యారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు శివశంకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బలరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కురుబలకు సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర -గోనెగండ్ల: కురవలకు కర్నూలు ఎంపీ మరియు రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని కురవ యవజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఈనెల 26 మదనపల్లిలో జరగు ఆంధ్రప్రదేశ్ కురవ సంఘం 8వ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగినటువంటి కురువకులస్తులకు వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 8 అసెంబ్లీ స్థానాలు 2రెండు పార్లమెంటు స్థానాలు 4 ఎమ్మెల్సీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న మదనపల్లిలో జరగనున్న రాష్ట్ర కురబ, కురుమ, కురవ సంఘం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కురవ సాధికారిక కమిటీ జిల్లా కన్వీనర్ వెంకటరాముడు కురవ యవజన సంఘం జిల్లా కార్యదర్శి బీరప్ప, గోనెగండ్ల మండల కురువ సంఘం సీనియర్ నాయకులు విల్లిగుండ్ల జయరాయుడు, ఎమ్మిగనూరు యవ నాయకులు నరసింహ, రంగన్న, మహేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి అండగా వాల్మీకులు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రాష్ట్రంలో జగనన్నకు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి బోయ వాల్మీకులు అండగా ఉంటారని వాల్మీకి నాయకులు అళ్లయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వెన్నంటి వాల్మీకులు ఉంటారన్నారు. వైసీపీ తప్ప వేరొక రాజకీయ పార్టీ వెంట వాల్మీకులు లేరని తెలిపారు. కొంత మంది నాయ కులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్నారు. మాలో ప్రాణం ఉన్నంతవరకు రాష్ట్రంలో జగనన్నకు, మంత్రాలయం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వెంట నడుస్తామని హామీ ఇచ్చారు. రాబోయే 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, బాలనాగిరెడ్డిని నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

దాతల సహకారంతోనే నోపా భవనం ఏర్పాటు

నోపా భవన ప్రారంభోత్సవానికి హాజరైన మేయర్..ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: కర్నూలు నాయి బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్మించిన 5 అంతస్తుల నూతన భవన ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. కర్నూలు శివారులోని రాయలసీమ యూనివర్సిటీ సమీపంలో శనివారం నోపాఅధ్యక్షుడు డా. నవీన్ కుమార్ అధ్యక్షతన కార్తికవనభోజనం, నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ బి.ఎల్లారామయ్య, పాణ్యం,కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ పార్లమెంట్ సభ్యులు బుట్టా రేణుక,డీఎస్పీమహబూబ్‌బాషా, సీఐ ఉపేంద్రబాబు, జిల్లా నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు జమ్ముల జనార్ధన్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటాడి మాదిరిగానే ఈ ఏడాది నాయి బ్రాహ్మణ సోదరులు మన భోజన కార్యక్రమం జరుపుకోవడం సంతోషదాయకమని చెప్పారు. ప్రధానంగా కమ్యూనిటీ హాలుతో పాటు విద్యార్థి వసతిగృహం నిర్మించడం ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. నాయి బ్రాహ్మణులు విద్యకి అత్యంత ప్రాధాన్యతనివ్వడం సంతోషకరమన్నారు. అది కూడా జిల్లా కేంద్రంలో విద్యార్థులకు ఒక షెల్టర్ ఉండాలనే ఉద్దేశంతో కీర్తిశేషులు సీవీ నర్సయ్య ధృడ సంకల్పంతోనే భవన నిర్మాణాన్ని ప్రారంభించడం, ఆయన మరణానంతరం ఆ బాధ్యతను తన తనయుడు డా.నవీన్ కుమార్ భుజస్కందాలపై వేసుకొని పూర్తి చేయడం హర్షించదగిన విషయమని చెప్పారు. టీటీడీ ట్రస్ట్‌బోర్డ్‌మెంబరు సిద్ధవటం యానాదయ్య మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ఎంతో ప్రాధాన్యతనిచ్చిందని తెలిపారు. ప్రతి సెలూన్ కు 150 యూనిట్ల వరకు ఉచిత కరెంటు,జగనన్న తోడు కింద పేద నాయి బ్రాహ్మణులకు రూ.10 వేలు ఉచితంగాఅందిస్తున్నానన్నారు. పార్లమెంట్ మాజీ సభ్యురాలుబుట్టా రేణుక మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరి గానే ప్రస్తుతం కార్తీక వనభోజనం నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం పదిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాణించిన విద్యార్థులకు ఆమె ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా నలుమూలల నుండి నాయి బ్రాహ్మణ సోదరులు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నోపా ఉపాధ్యక్షుడు ధనవిజయుడు, నోపా జనరల్ సెక్రెటరీ పోలీసు వెంకటస్వామి, నోప కోశాధికారి అనుకొండ మద్దిలేటి, రామాంజనేయులు మల్లికార్జున వెంకటేష్, పసువుల మధు, లక్ష్మీపురం రాఘవేంద్ర దేవనకొండ పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - మంత్రి గుమ్మనూరు

విశాలాంధ్ర - చిప్పగిరి: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కార్మిక శాఖ మంత్రివర్యులు గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం మండల పరిధిలోని నేమకల్లులో ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గడప గడప కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. గడపగడప కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ కార్యాలయాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, ఆ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే లక్ష్యంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలలో ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటరీ వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. దీంతో అర్హులైన ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. నేమకల్లు గ్రామం నందు ఎన్నో సంవత్సరాలుగా ప్రధాన రహదారి సిమెంటు రోడ్డుకు నోచుకోకపోవడంతో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామంలో మరో రూ 40 లక్షలతో గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం గడప గడప కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రమాద బీమా పాలసీ సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ప్రమాద బీమా పాలసీని ప్రతిఒక్క జర్నలిస్టు సద్వినియోగం చేసుకోవాలని గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా.శంకర్‌శర్మ చెప్పారు. శనివారం గాయత్రిఎస్టేట్ సద్గురుదత్త పాలిక్లినిక్‌లో ప్రమాద భీమపై జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.5 లక్షల ప్రమాద బీమాపాలసీకి అయ్యే ఖర్చును ఆయనే ఇన్సూరెన్స్ అధికారులకు అందజేశారు. ప్రమాద బీమా పాలసీ చేయించుకున్న వారు భారతదేశంలో పాటు ఇతర ఏదేశాలలోనైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ఇన్సూరెన్స్ అధికారులు అందజేస్తారని తెలిపారు. సమయపాలన లేకుండా విధు లు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ప్రమాదబీమా పాలసీలు చేయించడం మంచిదే నన్నారు. కార్యక్రమంలో ఐపివిబి మేనేజర్ మహమ్మద్ అజీజ్, మెయిల్ ఓవర్ సర్ చిన్న రాజు, తపాల శాఖాధికారి అజయ్ కుమార్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -ఆదోని రూరల్ : కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షురాలు సోని యా గాంధీ 77వ జయంతి వేడుకలను శనివారం ఆపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీల కంఠప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు, సీనియర్ నాయకులు సాయినాథ్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నూర్‌అహ్మద్, యువ నాయకులు శ్రీనిత్‌లు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం వారు మాట్లా డుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం హర్షించదగ్గ విషయ మన్నారు. సోనియా గాంధీ పదవులు ఆశించే వ్యక్తి కాదని, ప్రజా సేవకు నిమగ్నమై ఆమె ఓశక్తిగా మారిందని తెలిపారు. దేశ ప్రధాని అవకాశమున్న ఇతరులకు అవకాశం కల్పించిన ధీరోదత్తమురాలు, త్యాగమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకుడు జయరాం,ఇర్ఫాన్, మద్దిలేటి, గోవిందు, రామన్న యాదవ్, షేక్షావలి, హుస్సేన్, లక్ష్మన్న, నాగేష్,రాములు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-కల్లూరు : తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని బొల్లవరంలో ఆమె ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసిందని కేవలం వారి స్వలాభాల కోసమే నిధులు కేటాయించుకుని పంచుకుంటున్నారని మండిపడ్డారు. గ్రామాలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించి గ్రామాల అభివృద్ధి పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేశారని, ప్రజా ఓట్లతో గెలిచిన సర్పంచులకు పవర్ లేకుండా వారి చేతుల్లోకి తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో పిచ్చి తుగ్లక్ పాలన జరుగుతుందని రాబోయే ఎన్నికల్లో తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సర్పంచ్ జయన్నగౌడ్, విజయ్ కుమార్,బివిజీ మస్తాన్ నాయుడు, పీవీ రమణరెడ్డి,ఎం.మధు,వి.లక్ష్మన్న, జానకి రాముడు, వెంకటేశ్వర్లు, దున్నపోతుల మస్తాన్ నాయుడు, సురేంద్ర, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రధానం



విశాలాంధ్ర-గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్ కైరవాడిలో దుర్గా భవాని, గోమాత ఆరాధన హెూత్సవలు సందర్భంగా జరిగిన తాలుకా స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కోడుమూరు జట్టుకు రూ. 12,016లు ద్వితీయ స్థానంలో నిలిచిన హెచ్ కైరవాడి జట్టుకు రూ.6,016లను దేవాలయ నిర్వాహకులు అందజేశారు. ఈపోటీల్లో పలు ప్రాంతాల నుంచి దాదాపు 15జట్టులు పాల్గొన్నాయి.

రీ -సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలి

విశాలాంధ్ర-కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీ-సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని మండల సర్వేయర్ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దశల వారీగా గ్రామాల్లో రీ సర్వే చెపట్టడం జరుగుతుందన్నారు.రీసర్వే పూర్తయిన రైతుల పొలాలకు నోటీసులు సిద్ధం చేయడం జరిగిందని ఆ నోటీసులు ప్రతిఒక్కరూ తీసుకుని వారి అభిప్రాయాలను 15 రోజుల్లో తెలియజేయాలని సూచించారు. నోటీసులు తీసుకున్న తర్వాత అభిప్రాయాలు తెలియజేయకపోతే నోటీసులో ఉన్న కొలతల ప్రకారమే యధావిధిగా ముద్రించడం జరుగుతుందని వాటి ప్రకారమే పాస్ పుస్తకాలు కార్డులో నమోదవుతాయన్నారు. 9(2) రీ సర్వే రైతులకు ఒక వరం అని ఏదైనా చిన్నపాటి సమస్యలు ఉంటే మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. సమస్యాత్మక భూములుగా ముద్రించబడితే దశాబ్దాలు మారిన భూ సమస్యలు పరిష్కారం కాక వారి వారసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. నోటీసులను సంబంధిత అధికారుల అందించినప్పుడు రైతులు తీసుకొని వారి అభిప్రాయాలు స్వేచ్ఛగా తెలియజేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

రాజేంద్రన్ మృతి సీపీఐకి తీరనిలోటు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్ మృతి సీపీఐకి తీరనిలోటని ఆయన మృతికి సంతాపం తెలియచేస్తూ పూలమాలలువేసి నివాళులు అర్పించారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డిల ఆద్వర్యంలో రాజేంద్రన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజేంద్రన్ పదేళ్ల పాటు సీపీఐ శాసనసభ్యులుగా, 8 సంవత్సరాల నుండి పార్టీ రాష్ట్రకార్యదర్శిగా పనిచేశారన్నారు. అనారోగ్యంతో కోలుకోలేక మృతి చెందినట్లు వారు తెలిపారు. ఆయన మృతికి సంతాపం తెలి యచేస్తూ కుటుంబ సభ్యులకు

సానుభూతి ని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయకార్యదర్శి డి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షకార్యదర్శులు బాబయ్య, బీసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్, దస్తగిరి, రామచంద్ర, సురేంద్ర, విజయ, ప్రేమలత నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -కౌతాళం: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరూ లబ్ధి పొందుతున్నారని వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు ప్రహల్లాద చారి ,మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి ,గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ అన్నారు. శనివారం ఉదయం కౌతాళం గ్రామంలోని శివప్ప నగర్, ఎస్సీ కాలనీ, రాజా నగర్ లో గడప గడపకు వైయస్సార్ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, చేయూత ,వాహన మిత్ర ,పక్క గృహాల నిర్మాణం ,విద్యా దీవెన, పింఛను వంటి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలతో చర్చించారు. అలాగే కాలనీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు .పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఏ రాష్ట్రంలో కూడా మన రాష్ట్రంలోఅమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలలో అమలు కావడం లేదన్నారు .రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమం కొరకు, పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు .రాబోయే కాలంలో మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ సర్పంచ్ అవతారం ,పాఠశాల కమిటీ

చైర్మన్ వడ్డే రాముడు,సమద్ ఇతరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కావాలని ఆశ ఉంది

విశాలాంధ్ర- హొళగుంద : ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కావాలని ఆశ ఉన్నదని కర్నూలు జిల్లా వైసీపీ కోశాధికారి తెర్నేకల్ కాపు మధుసూదన్ రెడ్డి అన్నారు శనివారం ఎల్లార్తిలో వరసిద్ధి ఆంజనేయస్వామిని ఆయన దర్శించుకున్నారు .ఈ సందర్భంగా కాపు మధుసూదన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్ కొనసాగితే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని మండలాల్లో వైయస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నానని ఆలూరు నియోజకవర్గం నుండి బరిలో నిలవడానికి చిన్న ఆశ కోరిక తనకుఉన్నదని తన వంతు ప్రయత్నిస్తున్నానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలబడడానికి ప్రయత్నిస్తున్నానని, ప్రజలు, వైకాపా నాయకులు, మీడియా మిత్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు .ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైయస్ భారతి ఆయురారోగ్య ఉండాలంటూ రాష్ట్ర అభివృద్ధికి ఆమెమరెన్నో సేవలు చేయాలంటూ పార్టీ అభివృద్ధికి అమ్మలా అండగా ఉండాలంటూ దేవదేవునికి ప్రార్థించానన్నారు. వైయస్ భారతికి జన్మదినకేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు .ఈయన వెంట వైకాపా సీనియర్ నాయకుడు నర్సారెడ్డి ,హేమాద్రి ,నాగరాజు గౌడ ,సుధాకర్ రెడ్డి ,లక్ష్మీపతి ,వార్డ్ మెంబర్ ఈరన్న ,ఎస్కే గిరి ,హేమాద్రి ,లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

విశాలాంధ్ర -బనగానపల్లె: కార్యకర్తను పరామర్శించిను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి బనగానపల్లె లోని బీసీ గుర్రెడ్డి కాలనీలో ఏరాసు హరినాథ్ రెడ్డి కొన్ని రోజుల క్రితం బైక్ ప్రమాదంలో గాయపడి ఉదయానంద హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి వారి ఇంటి దగ్గరికి వెళ్లి హరిని పరామర్శించి వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మల్లారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర -శ్రీశైలం: మండలంలోని సున్నిపెంట ఏపీ ఆర్ఎస్ పాఠశాల బీసీ (స్థానిక మహాత్మ జ్యోతిబాయ్ పూలే స్కూల్) నందు పూర్వ విద్యార్థుల సమ్మేళనం 1997-1998 బ్యాచ్ శనివారం ఘనంగానిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు తమ పూర్వ అనుభవాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు స్కూల్ నందు పాఠశాలకు అధునాతమైన కంప్యూటర్లు మరియు గ్రంథాలయమునకు పుస్తకములు బహుకరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు,. తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమద్వ్రతం

విశాలాంధ్ర - వెల్దుర్తి : మండల కేంద్రమైన వెల్దుర్తి సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద శనివారం హనుమద్ వ్రతం భక్తులు,ప్రజల నడుమ ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కె. శ్రీదేవి హాజరై హోమం నందు పూజలు చేశారు.అనంతరం ఆలయ సభ్యులు, శాలువాలతో ఎమ్మెల్యే కె.శ్రీ దేవిను సత్కరించారు. ఎమ్మెల్యే వెంట కృష్ణగిరి మండల ఎంపిపి డాక్టర్ వెంకటరామిరెడ్డి, వెల్దుర్తి మండల వైకాపా కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్ రెడ్డి, వైయస్ఆర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా రైల్వేసహాయమాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి హనుమద్వ్రతం పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.అనంతరం సాయంకాలం నిర్వహించే ఊరేగింపు కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, పీఠాధిపతులు హాజరై, స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు.

అసమర్ధుడు జగన్ పాలన మాకొద్దు

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ఉల్లిగడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని అసమర్థుడు వైయస్ జగన్ పాలన మాకొద్దు అంటూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సంఘం జిల్లా కన్వీనర్ ఎం.ఎండి.నూర్ ఆగ్రహ వ్యక్తం చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు గోవిందా..గోవిందా అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. గుండ్లకమ్మ మూడవ గేటు కొట్టుకుపోయి ఏడాదిన్నర కాలం కావస్తున్న మరమ్మత్తులు చేపట్టలేని నిర్లక్ష్య వైఖరి వైసీపీ ప్రభుత్వంలో ఉందన్నారు. సమస్యల పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్నే మచ్చుతునకగా భావించవచ్చని చెప్పుకొచ్చారు. నైతిక బాధ్యత వహిస్తూ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోవడంతో నీరు సముద్రంలో కలసి పోయిందని దీంతో త్రాగునీటి, సాగునీటికి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం కళ్లు తెరిచి నీటి వనరులను కాపాడుకునేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాక్టరు బోల్తా -వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చింతలచెరువు గ్రామంలో పొలం పనుల నిమిత్తం ట్రాక్టరులో వెలుతున్న లక్ష్మీనారాయణ(47) ప్రమా దవశాత్తు ట్రాక్టరు బోల్తా పడటంతో అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్సై రమణయ్య తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి శనివారం తెల్లవారు జామున ట్రాక్టరు గొర్రు తీసుకుని పొలం దున్నేందుకు బయల్దేరారు. పొలాల రస్తాలో మట్టి దారిలో అక్కడే ధాన్యం ఆరవేయడంతో పక్కకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ట్రాక్టరు ప్రమాదవశాత్తు సమీపంలోని చిన్నకాలువలో బోల్తాపడింది. దీంతో ట్రాక్టరులోని వ్యక్తి తలభాగం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సం తానం ఉన్నారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

11న కలెక్టరేట్‌లో స్పందన

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : ఈనెల 11న సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గృహ ప్రవేశానికి హాజరైన కోట్ల

విశాలాంధ్ర -వెల్దుర్తి : క్రిష్ణగిరి తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎరుకల చెరువు శివయ్య వెల్దుర్తిలో నిర్వహిం చిన నూతన గృహప్రవేశానికి శనివా రం ముఖ్య అతిథిగా తెలుగుదేశం పా ర్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి హాజరైయ్యారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు శివశంకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బలరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కురుబలకు సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర -గోనెగండ్ల: కురవలకు కర్నూలు ఎంపీ మరియు రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించా లని కురవ యవజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామ కృష్ణ అన్నారు.శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఈనెల 26 మదనపల్లిలో జరగు ఆంధ్ర ప్రదేశ్ కురవ సంఘం 8వ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వాల్ పోస్టర్లు విడుదల చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగినటువంటి కురువకులస్తులకు వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 8 అసెంబ్లీ స్థానాలు 2రెండు పార్లమెంటు స్థానాలు 4 ఎమ్మెల్సీలు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈనెల 26న మదనపల్లిలో జరగనున్న రాష్ట్ర కురబ, కురుమ, కురవ సంఘం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కురవ సాధికారిక కమిటీ జిల్లా కన్వీనర్ వెంకటరాముడు కురవ యవజన సంఘం జిల్లా కార్యదర్శి బీరప్ప, గోనెగండ్ల మండల కురువ సంఘం సీనియర్ నాయకులు పిల్లిగుండ్ల జయరాయుడు, ఎమ్మిగనూరు యవ నాయకులు నరసింహ, రంగన్న, మహేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి అండగా వాల్మీకులు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రాష్ట్రంలో జగనన్నకు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి బోయ వాల్మీకులు అండగా ఉంటారని వాల్మీకి నాయకులు అళ్లయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వెన్నంటి వాల్మీకులు ఉంటారన్నారు. వైసీపీ తప్ప వేరొక రాజకీయ పార్టీ వెంట వాల్మీకులు లేరని తెలిపారు. కొంత మంది నాయ కులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్నారు.

సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం తగదు - ఎమ్మెల్యే శిల్పా

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డులో వార్డు ఇంచార్జ్ అనిల్ అమృతరాజ్, రాష్ట్ర దృశ్యకత డైరెక్టర్ సునీత అమృతరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 191 వారోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొని ప్రతి గడప తిరుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా వైఎస్ఆర్ ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని,

ప్రజలకు సచివాలయాలు ఏర్పాటు చేయడంతో వారి సమస్యలను అక్కడే పరిష్కరించుకునే విధంగా ఏర్పాటు చేసినందుకు సీఎం జగన్ కు, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ టిడిపి నాయకులు సంక్షేమ పథకాలపై ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, వచ్చే 2024 ఎలక్షన్లో రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి జెండా ఎగురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాభున్నిసా, వైకాపా నాయకులు పున్న శేషయ్య, జాకీర్ హుస్సేన్, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు, కౌన్సిలర్స్ కృష్ణమోహన్, శాదిక్ భాష, పార్థుడు, రహంతుల్లా, కిరణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

విశాలాంధ్ర - చిప్పగిరి: మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామం నందు అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. గురు స్వామి చిప్పగిరి జెడ్పిటిసి సభ్యులు విరుపాక్షి ఆధ్వర్యంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా గురుస్వామి విరుపాక్షి మాట్లాడుతూ ప్రతిఏటా చిప్పగిరి గ్రామం నందు ఎంతో నిష్టతో అయ్యప్ప మాల ధరించి మాలధార స్థలమయములు పూజలు నిర్వహిస్తూ ఉంటారని, ఇందులో భాగంగానే ప్రతి ఏటమాదిరే ఈ సంవత్సరం కూడా గ్రామంలోని

కొండపై వెలిసిన రాయచోటయ్య దేవాలయం నుండి గ్రామ పూర్వ వీధుల గుండా అయ్యప్ప స్వామి ప్రతిమను ట్రాక్టర్ పై ఊరేగిస్తూ గుంతకల్లు ఆలూరు ప్రధాన రహదారిపై అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఆంజనేయ దేవాలయం, భీమలింగేశ్వర దేవాలయం, స్వామి దేవాలయం వరకు 50 మంది చిన్నారులతో కళ చాలా హారతులతో అంగరంగ వైభవంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపు ఎందుకు వచ్చిన భక్తాదుల కొరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బలిజ, కాపు కులస్తులు ఐక్యమత్యంతో ముందుకెళ్లాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : బలిజ కాపు కులస్తులు ఐకమత్యంతో ముందుకెళ్లాలని యారో కన్స్ట్రక్షన్ సంస్థ అధినేత, కాపు బలిజ అన్న సత్రం అధ్యక్షులు శెట్టి విజయ్ కుమార్ అన్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహెూబిలంలో కాపు బలిజ సంఘం ఐక్యమత్యంతో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయ బలిజకాపు, తెలగ నిత్య అన్నదాన సత్రములో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రం అధ్యక్షులు శెట్టి విజయకుమార్ మాట్లాడుతూ కళ్యాణ మండప నిర్మానాన్ని రూ.40 లక్షలతో ఎకరా స్థలంలో చేపడతామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ బలిజ, కాపు కులస్తుల అభివృద్ధికి సహకారం అందించే పార్టీలకే మద్దతునిస్తుమన్నారు. పెద్ద సంఖ్యలో బలిజ, కాపు సంఘీయులు పాల్గొనడంతో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం సత్రం క్యాలెండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఉమ్మడి జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజరాయుడు, హైకోర్టు న్యాయవాది బోల బాలాజీ, రాయల్ కాప్స్ చైర్మన్ దేవి నాయుడు, రాము, ఎంపీపీ వీరభద్రుడు, కర్నూలు కోనేటి చంద్రబాబు నాయుడు, కోనేటి వెంకటేశ్వర్లు, చింతల రామకృష్ణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం రాజకీయం ఆర్థికంగా ఎదగాలి

బనగానపల్లె: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా బనగానపల్లె మండలం బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు చిరంజీవి ఆశీస్సులతో మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాను.బలిజ సంఘం అందరూ ఐకమత్యంగా ఉండి రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, రాజశేఖర్, రాందాస్‌రెడ్డి, సుబ్బయ్య, మధు, నీలి శ్రీనివాసులు, కిషోర్, బలిజ కులస్తులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనానికి తరలిరండి

విశాలాంధ్ర- కోడుమూరు: ఈనెల 11న సోమవారం పట్టణంలోని స్థానిక వల్లెలాంభ దేవి ఆలయం వద్ద సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే హిందూ సమ్మేళనం కార్యక్రమానికి హిందువులందరూ తరలిరావాలని శ్రీవల్లేలాంబ దేవాలయం ధర్మకర్త బి.రఘునాథరెడ్డి కోరారు.ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ ధర్మ సంరక్షణలో భాగంగా సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) వారి ఆధ్వర్యంలో "మన దేవాలయం ధార్మిక సామాజిక శక్తి కేంద్రం" అనే నినాదంతో నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఈనెల 11వ తేదీన స్థానిక వల్లెలాంభదేవి ఆలయం వద్ద ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు నిర్వహిస్తున్నామన్నారు. హిందూ సమ్మేళనం కార్యక్రమానికి మండలంలోని టీటీడీ సేవకులు, వినాయక మండపాల నిర్వహకులు,భజన బృంద సభ్యులు,కోలాటం,చెక్కభజన నిర్వహకులు, శివ మాలాధారణ,అయ్యప్ప మాలాధారణ స్వాముల తోపాటు భవాని మాత దీక్ష స్వాములు, వివిధ రంగాలలోని కళాకారులు, సమస్త దేవాలయాల కమిటీ సభ్యులందరూ పాల్గొని దిగ్విజయం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా పరిశుద్ధ జన్మోత్సవ ప్రతిష్ట దినం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల పరిధిలోని ముత్యాలపాడులో 131వ చర్చి ప్రతిష్ట దినాన్ని శనివారం డీనరీ చైర్మన్ రెవరెండ్ వరప్రసాద్ అధ్యక్షతన చర్చి ఫాదర్ రెవరెండ్ సంజీవరాజ్ ఆధ్వర్యం లో ఘనంగా చర్చి ప్రతిష్ట వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ప్రత్యేక ఆరాధనను నిర్వహించారు.1893 డిసెంబర్ 9న అప్పటి మిషనరీ ఆయన పెడ్రిక్ జెల్ చే ప్రతిష్ఠించబడి రెవరెండ్ డిండి షెఫర్డ్ నిర్మించబడి నేటికీ 131 ఏళ్లు పూర్తి చేసుకోవడం విశేషం.నాటి నుండి నేటి వరకు నంద్యాల అధ్యక్ష కండపు (ఎస్‌పిజి) సంఘం ఆధ్వర్యంలో ప్రస్తుతము సీఎస్ఐ జన్మోత్సవ ఆలయంగా ఎన్నో సేవలను ఎంతమందో మత గురువులను, ఎందరును ప్రవీణులుగా ఈ సంఘ సభ్యులను తీర్చిదిద్దడం విశేషం. ప్రతిష్ట దినోత్సవ, క్రీస్తు జన్మదినంల ప్రసంగాన్ని రెవరెండ్ వరప్రసాద్ నంద్యాల అధ్యక్ష ఖండపువైస్ ప్రెసిడెంట్ బోధించారు. అనంతరం గుడి ప్రదక్షణ చేసి ప్రత్యేక ఆరాధనను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ డీనరీ చైర్మన్ రెవరెండ్ సునీల్ కుమార్, ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చదరంగం పోటీలు

విశాలాంధ్ర - నంద్యాల: ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో శనివారం స్థానిక హనీఫ్ నగర్లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సుబ్బయ్య, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ విద్యాశ్రీ, రాష్ట్ర చెస్ సంఘం జాయింట్ సెక్రెటరీ రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ చదరంగం పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని తద్వారా చదువులలో కూడా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. నిరంతర సాధన ద్వారా క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. పోటీలలో దాదాపు 150 మంది చదరంగం క్రీడాకారులు జిల్లా వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర - వెలుగోడు : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. మండలం లోని గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాలలో శనివారం పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రజల కు పంపిణీ చేయడం జరిగింది. మరియు పంటల నీటి మందులను ఉపయోగించే డ్రోన్ పరికరాన్ని ప్రజలకు చూపించి అవగాహన కలిగించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన కల్పించడం జరిగింది. ఉజ్వల గ్యాస్ పథకం కింద లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు.. భారతదేశ అభివృద్ధి చెందే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.కార్యక్రమంలో ఈవోపీర్డీ అనంత శయన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



2024 ఎన్నికల్లో టీడీపీని గెలిపించండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : 2024 ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించు కుందామని తాలుకా టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్వీ ప్యాలెస్ వీధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవు తుందన్నారు.

కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, గుండా మణి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.